క్లుప్తంగా

గుబ్బాలమ్మ హుండీ రాబడి రూ.1,41,360



హుండీలు తెరచి లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిడదవోలు రూరల్: గోపవరం గ్రామంలో ఉన్న గుబ్బాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ రాబడిని సోమవారం లెక్కించినట్టు ఆలయ మేనేజర్ నామా సూర్యప్రకాశరావు తెలిపారు. 99 రోజులకు సంబంధించి ఆలయంలో హుండీలను దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కించగా రూ.1,41,360 ఆదాయం వచ్చిందన్నారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ వడ్డి రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ నమోదు శిబిరం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

నిడదవోలు రూరల్: ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను పట్టణ ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని నెహ్రూనగర్ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కౌన్సిలర్లు కామిశెట్టి సత్యనారాయణ, ఎస్‌కే వజీరుద్దీన్, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

తాళ్లపూడి: తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన నాలుగో తరగతి చదువుతున్న బాలిక సైదు సువర్ణ ఇటీవల కన్ను కోల్పోయింది. మండల మానవత స్వచ్ఛంద సంస్థ బాలిక వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. మానవత మండల అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు చేతులు మీదుగా రూ.5 వేలు అందించారు. మానవత సంస్థ రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, మానవత సభ్యులు జంగా లక్ష్మీపతి, చంద్రగుప్త తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థినికి గోల్డ్‌మెడల్



లావణ్యదేవిని గోల్డ్‌మెడల్‌తో సత్కరిస్తున్న గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

నల్లజర్ల: అచ్చన్నపాలెంకు చెందిన డాక్టరు పాతూరి లావణ్యదేవికి గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సావిత్రీ సోమవారం గోల్డ్‌మెడల్‌తో పాటు మెరిట్ ప్రశంసాపత్రం అందించినట్టు మండల మానవత డైరెక్టర్ లావణ్యదేవి తండ్రి సత్యనారాయణ తెలిపారు. 2018లో జరిగిన డీజీఓ పరీక్షల్లో మొదటి ప్రయత్నంలోనే అత్యుత్తమ మార్కులు సాధించినందుకు గాను ఈ పురస్కారం అందుకున్నట్టు చెప్పారు.

పోషణ పక్వాడ అవగాహన ర్యాలీ

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోరుమామిడిలో పోషణ పక్వాడ అవగాహన ర్యాలీని సోమవారం నిర్వహించారు. సీడీపీఓ ఎం.ఆశారోహిణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఏప్రిల్ 3వ తేదీ వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

శిశు సంరక్షణకు పోషణ అభియాన్

నల్లజర్ల: మాతా.శిశు సంరక్షణతో పాటు ఆరోగ్యకర దేశ నిర్మాణం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ పోషణ అభియాన్ (పోషణ పక్షోత్సవాలు)కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నల్లజర్ల ఇన్‌చార్జి సీడీపీఓ వెంకటలక్ష్మి తెలిపారు. పోషకాహార లోపంతో కలిగే అనర్థాలను క్షేత్రస్థాయిలో తల్లులకు వివరించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

నల్లజర్ల: గత నెలలో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి బెయిల్‌పై వచ్చి దూబచర్లలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డ పాతనేరస్తులు ఇద్దరిని ఎస్‌ఐ నరసింహమూర్తి ఆదివారం సాయంత్రం అరెస్టు చేశారు. పాలకొల్లుకు చెందిన దాసరి సత్యనారాయణ, పెనుగొండ మండలం చినమల్లు గ్రామానికి చెందిన గెద్దాడ సురేంద్ర ఈ నెల15న దూబచర్లలో నందమూరి సత్యనారాయణ, చీమకుర్తి సత్యసాయిబాబా ఇంటి తలుపుల తాళాలు పగులగొట్టి దాదాపు లక్ష రుపాయల విలువల బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. పంగిడి బస్టాండు సమీపంలో అనుమానస్పదంగా తిరుగుతున్న వీరిని అదుపులోకి తీసుకుని విచారించగా ఈ రెండు చోరీలు బయటపడ్డాయి. వారి లక్ష విలువ గల బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు. ముద్దాయిలను తాడేపల్లిగూడెం కోర్టులో హాజరు పర్చినట్టు తెలిపారు.

నోరూరిస్తూ.. ఉపాధినిస్తూ..

- పచ్చళ్ల తయారీతో బతుకుబండికి భరోసా
- సుమారు వేయి కుటుంబాలకు ఆధారం



మెషీన్‌లో ఆడటానికి కాయలను తీసుకెళ్తున్న వ్యాపారి



మెషీన్లో కారం ఆడుతూ..



మెషీన్‌లో ఆడిన పండు మిరప గుజ్జును డ్రమ్‌లో వేస్తూ..

పెరవలి: బతుకుదెరువు కోసం ప్రారంభించిన చిరు వ్యాపారం నేడు నలుగురికి ఉపాధి కల్పిస్తోంది. తమ కుటుంబాలను దర్జాగా పోషించుకునేలా అవకాశం ఇస్తోంది. ఉన్న ఊరులో పనులు లేక నానా ఇబ్బందులు పడుతున్న సమయంలో కొందరు కొద్దికొద్దిగా పచ్చళ్లు పట్టి సుదూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించుకుంటూ జీవనోపాధి పొందేవారు. ఆ వ్యాపారమే నేడు పదిమందికీ ఉపయోగపడుతూ కుటీర పరిశ్రమగా మారింది. చిరు వ్యాపారుల శ్రమ, నాణ్యతతో వృద్ధి చెందింది.

ఎంతో పేరు

ఉసులుమర్రు పచ్చళ్లకు వివిధ జిల్లాల్లో ఎంతో పేరు ఉంది. సాధారణంగా టమాటా, ఉసిరి, అల్లం, మాగాయి, ఆవకాయ, గోంగూర, కాలీఫ్లవర్, పండుమిరప పచ్చళ్లు పట్టి ఏడాది పొడవునా అమ్మకాలు కొనసాగిస్తారు. మండలంలోని అన్నవరప్పాడు, కాపవరం, ఉసులుమర్రు గ్రామాల్లో ఈ పచ్చళ్ల వ్యాపారంపై వేయి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. అన్ని పచ్చళ్ల కంటే పండుమిరప ఎంతో జాగ్రత్తగా పట్టాలని వ్యాపారులు చెబుతున్నారు. దీని రుచి ఎంత బావుంటుందో పట్టడం అంతే కష్టమని వివరిస్తున్నారు.

డ్రమ్ము పచ్చడికి రూ.30 వేలు

ఏడాదికి సరిపడా ఈ పచ్చడి పట్టాలంటే అరటన్ను పండుమిరపకాయలు కావాలి. వీటి ధర కిలో రూ.80 నుంచి రూ.120 ఉంటుంది. ఇందులో చింతపండు, మెంతులు, జీలకర్ర, నూనె, ఉప్పు వినియోగిస్తారు. ఒక డ్రమ్ము పచ్చడి తయారవ్వాలంటే సుమారు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాలి. గతంలో పండుమిరప పచ్చడిని రుబ్బేవారు. అయితే కూలీలు ఈ పనికి రాకపోవడంతో ఇప్పుడు మెషీన్ లోనే ఆడి పచ్చడి పాళ్లను కలుపుతున్నారు. ఒక డ్రమ్ము పచ్చడికి 200 కిలోలు పండుమిరప కాయలు, 40 కిలోల చింతపండు, 30 కిలోల ఉప్పు, నాలుగు కిలోల మెంతులు, కిలో జీలకర్ర పొడి, 40 కిలోల నూనె అవసరం. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో పచ్చడిని రూ.250 నుంచి రూ.300 వరకూ విక్రయిస్తున్నారు. పచ్చళ్లను ఇక్కడ తయారు చేసి నెల్లూరు, గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటాం



పచ్చళ్లు అన్నింటిలోనూ పండు మిరపకాయ పచ్చడి పట్టడం చాలా కష్టం. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా శరీరం అంతా మంటగా మారుతుంది. అందుకే ఈ పచ్చడి పట్టేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. ఈ వ్యాపారమే మా కుటుంబాన్ని పోషిస్తోంది.

– మల్లు వెంకటేశ్వరరావు పచ్చడి వ్యాపారి, ఉసులుమర్రు

280 కుటుంబాలకు ఆధారం



గ్రామంలో 280 కుటుంబాలు ఈ పచ్చళ్ల వ్యాపారాన్నే నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నాయి. బ్యాంకులు రుణాలు ఇస్తే మరింత మెరుగ్గా వ్యాపారాలు చేస్తాం. పెట్టుబడి కోసం చేసిన అప్పుకి వచ్చిన లాభం వడ్డీగా సరిపోతోంది. వ్యాపారంలో అనేక ఇబ్బందులు ఉన్నాయి.

– మల్లు దుర్గారావు, పచ్చడి వ్యాపారి, ఉసులుమర్రు

పోషణకు ఇబ్బంది లేదు



కుటుంబమంతా పచ్చళ్లపైనే ఆధారపడ్డాం. భర్తతో పాటు సుదూర ప్రాంతాలకు వ్యాపారం కోసం వెళతాను. పచ్చళ్లు ఇక్కడ తయారు చేసుకుని, విక్రయించడానికి అక్కడికి వెళ్తాం. కుటుంబ పోషణకు ఇబ్బంది లేదు కానీ, ఆస్తులు మాత్రం ఏమీ లేవు.

– పుల్లా కొండమ్మ, పచ్చడి వ్యాపారి, ఉసులుమర్రు

ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా



తీపర్రులో ఆసరా లబ్ధిదారురాలికి బొట్టుపెడుతున్న డ్వాక్రా సీసీ కనకదుర్గ

పెరవలి: మహిళలు ఆర్థిక ప్రగతికి జగనన్న ఆసరా పథకం దోహదపడుతుందని డ్వాక్రా సీసీ కనకదుర్గ పేర్కొన్నారు. ఆసరా సంబరాల్లో భాగంగా పెరవలి మండలం తీపర్రులో ఇంటింటికి బొట్టుపెట్టు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదుర్గ మాట్లాడుతూ మండలంలో 1650 డ్వాక్రా సంఘాలు ఉన్నాయని ప్రతి సంఘంలో సభ్యులకు ఆసరా పథకం ద్వారా రూ.10వేల నుంచి రూ.30 వేల వరకూ రుణ సదుపాయం కల్పించామని తెలిపారు. కూరగాయల దుకాణం, పాన్‌షాపు, కిరణా, ఫ్యాన్సీ, పండ్ల వ్యాపారం వంటి వాటికి వినియోగించారని దీని వల్ల ఆయా కుటుంబాలు ఆర్థిక ప్రగతి సాధిస్తున్నాయని తెలిపారు. ఆసరా సంబరాలు ఏప్రిల్ ఐదో తేదీ వరకూ కొనసాగుతాయని, ప్రతి గ్రామంలో ఇంటింటికి బొట్టు పెట్టు కార్యక్రమం చేపట్టి వారితో వ్యాపారాల అభివృద్ధి గురించి చర్చిస్తామని తెలిపారు. మండలంలో సుమారు 8 వేల మందికి రుణ సదుపాయం కల్పించామని 3వ విడత ఈ నెల 25 వతేదీన విడుదల అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ వీఓలు, సీఏలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పైడిమెట్ట వాసికి ఉగాది నందీ పురస్కారం



నారాయణమూర్తి చేతులు మీదుగా నందీ పురస్కారం అందుకున్న జేవీ ప్రమోద్ కుమార్

తాళ్లపూడి: పైడిమెట్ట గ్రామానికి చెందిన కవి, రచయిత, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు జేవీ ప్రమోద్‌కుమార్‌కు ఉగాది నందీ పురస్కారం లభించింది. గోదావరి ఉత్సవ్ పేరుతో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సంగీత నాటక అకాడమీ, అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక సౌజన్యంతో ఫిలంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు రాజా యోనా ఆధ్వర్యంలో రాజమండ్రి రోటరీ క్లబ్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో పురస్కారం అందజేశారు. సినీ నటుడు, దర్శక, నిర్మాత ఆర్.నారాయణమూర్తి చేతుల మీదుగా నందీ పురస్కారం ప్రమోద్‌కుమార్ అందుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాలకు చెందిన 30 మందికి ఈ పుస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ పాత్రికేయులు అప్పన రాజా, పరస రాధాకృష్ణ, అనంతం రామకృష్ణ, ఎం సత్యనారాయణ, ఎన్.గోపాల కృష్ణ, కోటేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రతి జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలు బీసీలకు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు

కొవ్వూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అన్నీ రాజకీయ పార్టీలు జిల్లాకు మూడు అసెంబ్లీ స్థానాలు చొప్పున బీసీలకు కేటాయించాలని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం పట్టణంలో లిటరరీక్లబ్ కల్యాణ మండపంలో నిర్వహించిన బీసీ సంఘ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గడచిన ఏళ్లలో రెండు కులాలే రాష్ట్రాన్ని పాలిస్తున్నాయన్నారు. గ్రామ స్థాయిలో నుంచి బీసీ నాయకులను తయారు చేయడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని రాష్ట్ర బీసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతా కృష్ణారావు పేర్కొన్నారు. బీసీల్లో రాజకీయ చైతన్యం తీసుకొచ్చి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు అన్నారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏలూరి విజయలక్ష్మి, మైనారిటీ సెల్ నాయకులు ఆషిక్ భాషా, అగ్ని కుల క్షత్రియ రాష్ట్ర నాయకుడు మల్లాడి సత్తిబాబు, నాయకులు పేరం శివనాగేశ్వరరావు, పోన్నా రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో ఉగాది వేడుకలు

- శ్రీవారికి ఇదే తొలి ఉత్సవం
- అన్ని ఏర్పాట్లు పూర్తి



క్షేత్రంలో ముస్తాబైన ఉగాది మండపం

ద్వారకాతిరుమల: తెలుగువారి అత్యంత విశిష్టమైన పండగ ఉగాది. ఈ రోజుతోనే కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. ఇతర రాష్ట్రాల వారు సైతం వారి కాలమాన ఆచార వ్యవహారాలను అనుసరించి ఉగాదిని జరుపుకొంటారు. ఆంగ్ల సంవత్సరం డిసెంబర్ 31తో ముగుస్తుంది. కొత్త సంవత్సరం జనవరి ఒకటితో ప్రారంభమవుతుంది. దీనికి సూచికగా పాత క్యాలెండర్ తీసేసి, కొత్త క్యాలండర్‌ను తగిలించుకుంటాం. అంతకంటే పర్యావరణంలోను, పరిసరాల్లోను ఏ విధమైన మార్పు కనిపించదు. అయితే తెలుగు సంవత్సరాది అలా కాదు. ప్రకృతిలోనూ, వాతావరణంలోనూ పెద్ద మార్పు కనబడుతుంది. తెలుగు సంవత్సరం శిశిర రుతువు ఫాల్గుణ అమావాస్యతో ముగుస్తుంది. మరునాడు చీకట్లు పోయి వెలుగులు పెరిగే శుక్లపాడ్యమితో కొత్త సంవత్సరం మొదలవుతుంది. పాత సంవత్సరపు చీకటి అనుభవాల నుంచి ఆనందపు వెలుగుల్లోకి వెల్లువలా మనం అడుగు వేస్తాం. వృక్షాలు కొత్త చిగుళ్లతో, ఆకుపచ్చ శోభతో, లేత మామిళ్లు, వేప పువ్వుల పరిమళాలు, ఫల, పుష్ప, వృక్షాల గుభాళింపులతో ప్రకృతి ఆహ్లాదపరుస్తూ ఉంటుంది. పక్షుల కిలకిల రావాలు, కోయిల పాటలు వీనుల విందు చేస్తూ వినిపిస్తాయి. ఆనందపు హరివిల్లు చేతబట్టి, వయ్యారంగా, రమణీయంగా తొలి వెలుగులలో.. చిరు చిరు నగవులతో.. తెలుగు వారింట ఉగాది ప్రవేశిస్తుంది.

పుణ్యక్షేత్రంలో..

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నకు ఉగాది పండగే తొలి ఉత్సవం. అందుకే ఈ పండగకు క్షేత్రంలో ప్రత్యేక స్థానం ఉంది. ఏటా శ్రీవారి వైభవాన్ని చాటేలా ఈ ఉత్సవాలను ఆలయ అధికారులు వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈనెల 22న సాయంత్రం 6 గంటలకు ఉభయ దేవేరులతో స్వామివారు ఆలయం నుంచి వెండి శేషవాహనంపై బయలుదేరి ఉగాది మండపం వద్దకు చేరుకుంటారు. అనంతరం మండపంలో శ్రీవారు, అమ్మవార్లను వేంచేపుచేసి అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణాన్ని జరిపి, రాశి ఫలాలను చదివి వినిపిస్తారు. ఆ తర్వాత పండిత సత్కారాలను ఘనంగా నిర్వహిస్తారు.

అంతర పంటలతో అధిక ఆదాయం



పెరవలిలోని జామ తోటలో అంతర పంటన పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ

పెరవలి: వాణిజ్య పంటల్లో అంతర పంటలు సాగు చేయడం వల్ల రైతులు అధిక ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ తెలిపారు. పెరవలిలో జామతోటలో అంతర పంటల గురించి రైతులకు సోమవారం వివరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కొబ్బరిలో కోకో, కూరగాయలు, పూల సాగు చేయవచ్చని, జామతోటలో కూరగాయలు, చెరకు, పూల సాగు చేయవచ్చని తెలిపారు. అరటిలో కొత్తిమీర, పచ్చిమిర్చి వేయవచ్చని, దొండ పందరిలో పచ్చివర్చి, వంగ, బెండ వంటి పంటలు వేయవచ్చని వివరించారు. ప్రధాన పంటలో అంతర పంటలు వేయడం వల్ల 365 రోజులు ఫల సాయం పొందవచ్చని, అంతేకాకుండా మిత్రపురుగులు వృద్ధి చెంది ప్రధాన పంటకు తెగుళ్ల బెడద లేకుండా ఉంటుందన్నారు. అంతర్ పంటల సాగుతో రైతులకు ప్రధాన పంటకంటే అధిక ఆదాయం లభిస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుజ్జి, భవానీ, సత్యనారాయణ రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో మంచి దిగుబడి

చాగల్లు: చంద్రవరంలో రైతు అవగాహన సమావేశం నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వచ్చిన మండల వ్యవసాయాధికారి కె.వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు అవలింబిస్తే మంచి పంట దిగుబడి పొందవచ్చని తెలిపారు. అనంతరం సాగులో తీసుకోవాల్సిన మెళకువలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దిపాటి శ్రీరామమూర్తి, జేఏసీ నాయకులు బండి అశోక్‌బాబు, ఎం.కొండదరామ్, గుమ్మడి శైలేంద్రరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మేరీమాత మహోత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జయరావు పొలిమెర

దేవరపల్లి: గౌరీపట్నంలోని ప్రముఖ క్రైస్తవ పుణ్యక్షేత్రం నిర్మలగిరిలో బుధవారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకూ మేరీమాత మహోత్సవాలు నిర్వహించనున్నట్టు ఏలూరు పీఠాధిపతులు రెవరెండ్ జయరావు పొలిమెర తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడుతూ మేరీమాత మహోత్సవాలకు నాలుగు జిల్లాల్లోని ప్రజాప్రతినిధులు, భక్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు 23న పరిశుద్ధ ఫ్రాన్సిస్ పోపుదూత, వాటికన్ భారత రాయబారి మోస్ట్ రెవరెండ్ లియోపోల్డో జిరెల్లి పాల్గొని సమిష్ట దివ్యబలిపూజ నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఇటలీ దేశస్థుడు లియోపోల్డో జిరెల్లి మొదటి సారిగా ఆంధ్రప్రదేశ్‌లోని నిర్మలగిరికి వస్తారని తెలిపారు. అలాగే ఆసియా ఖండానికి తెలుగు బిడ్డ ఫ్రాన్సిస్ పోప్ అనుసంధానంగా పనిచేసే హైదరాబాద్ అగ్రపీఠాధిపతి పూల ఆంతోని కార్డినల్ 25వ తేదీన సమిష్టి దివ్య బలిపూజ సమర్పిస్తారని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాల పోస్టర్లను బిషప్ జయరావు పొలిమెర ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వికార్ జనరల్ పి.బాల, పుణ్యక్షేత్రం డైరెక్టర్ రెవరెండ్ ఎస్. జాన్‌పీటర్, ఫాదర్లు, గురువులు పాల్గొన్నారు.

పన్ను వడ్డీ రాయితీపై అవగాహన పెంచండి

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ భావన రత్నకుమారి
- రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో సమావేశం



కొవ్వూరు సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: పురపాలక సంఘంలో ఆస్తి పన్ను వసూలుకి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి సూచించారు. పన్నుల వసూళ్లపై సోమవారం చైర్ పర్సన్ చాంబర్‌లో కమిషనర్ బి.శ్రీకాంత్, వార్డు సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ గతేడాది పన్నుల వసూళ్లలో కొవ్వూరు పురపాలక సంఘం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. పన్ను వసూళ్లలో సిబ్బంది ప్రణాళిక బద్ధంగా పని చేసి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. ఈ ఏడాది కుడా మొదటి స్థానంలో ఉండే దిశగా రెవెన్యూ, సచివాలయ సిబ్బంది సహకరించాలని కోరారు. కమిషనర్ బి.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో కొవ్వూరు పురపాలక సంఘం 14వ స్థానంలో ఉందన్నారు. మొత్తం రూ.3.48 కోట్ల డిమాండ్‌కి గాను ఇంత వరకు రూ.2.40 కోట్ల మేరకు పన్నులు వసూలు చేశామన్నారు. ఇంకా రూ.1.08 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. ఖాళీ స్థలాల యాజమానులు వివిధ ప్రాంతాల్లో ఉండడం మూలంగా సమాచారం చేరడ వేయడానికి ఇబ్బందులున్నాయన్నారు. సెల్‌ఫోన్ ద్వారా కొందరి సమాచారం అందించి వడ్డీ రాయితీకి గురించి వివరిస్తున్నామని కమిషనర్ తెలిపారు. రోజు సరాసరి రూ.4 లక్షల నుంచి రూ.5లక్షల సరాసరి పన్నులు వసూలు అవుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా పురసేవా యాప్, ఏపీసీఆర్‌డీపీ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా పన్నులు చెల్లించి రాయితీ పొందవచ్చు అన్నారు. ఇన్‌చార్జి ఆర్‌ఐ డి.శ్యామ్ సుందరం, మేనేజర్ జి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

కంబాలచెరువు: దేవరపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ ఇటీవల మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ ఎస్.ఈశ్వరరావు కుటుంబానికి అడిషనల్ ఎస్పీ ఎం.రజనీ సోమవారం రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు కార్పస్ ఫండ్ సొమ్ముకు సంబంధించి చెక్కును ఆయన భార్య ఎస్.ఈశ్వరి అందజేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ... ఈశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనను కలవవచ్చునని, పోలీసుశాఖ నుంచి అన్నివిధాల సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.

సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడి మృతికి సంతాపం

కొవ్వూరు: ఉమ్మడి జిల్లా డీసీసీబీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు వట్టి వెంకట పార్థసారథి మృతికి కొవ్వూరు నియోజకవర్గ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఇటీవల ఆయన కుమారుడు మాజీ మంత్రి వసంత్‌కుమార్ మృతిని తట్టుకోలేక పార్థసారథి మృతి చెందడం బాధకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు ఎండీ రఫీయుల్లాబేగ్, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించిన వారిలో ఉన్నారు.

రేపు ఉగాది సంబరాలు

కొవ్వూరు: స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయంలో శోభకృతు నామ సంవత్సర ఉగాది సంబరాలు బుధవారం నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఈ వేడుకల్లో భాగస్వాములుకావాలని మంత్రి క్యాంపు కార్యాలయవర్గాలు తెలిపాయి.

రాష్ట్రీయ స్వయం సేవక్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సంస్కృత పాఠశాల ప్రాంగణంలో శ్రీశోభకృత నామ సంవత్సరం ఉగాది సంబరాలు నిర్వహించనున్నట్టు ఆర్‌ఎస్‌ఎస్ ఖండ్ సంఘ్‌చాలక్ దొర్భల ప్రభాకర శర్మ తెలిపారు. ఎస్‌ఎల్ రామారావు అధ్యక్షత నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆకుతోట రామారావు హాజరుకానున్నట్టు తెలిపారు.

బ్యూటీషియన్ కోర్స్‌లో ఉచిత శిక్షణ

గోపాలపురం: నిరుద్యోగ యువతులకు బ్యూటీషియన్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు గోపాలపురం ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గోపాలపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 28వ తేదీ నుంచి బ్యూటీషియన్ కోర్స్‌లో యువతులకు శిక్షణ ఇస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఎంపీడీఓ కార్యాలయం లేదా స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎస్.సత్యశ్రీనివాస్ సెల్ 9899943366 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిడదవోలు రూరల్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిడదవోలు ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్యూటీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి సోమవారం తెలిపారు. బ్యూటిషియన్ కోర్సుకు ఐదో తరగతి చదివిన మహిళలు మాత్రమే అర్హులన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు పదోతరగతి చదివిన, 18 నుంచి 40ఏళ్ల వయస్సు గల కలిగిన వారంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమై రెండు నెలలు కొనసాగుతాయన్నారు. వివరాలకు స్కిల్ హబ్ కన్వీనర్ ఎస్.నాగేశ్వరరావు, సెల్ నంబర్ 99665 06484కు సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 756 మంది హాజరు

కొవ్వూరు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన లెక్క లు, బోటనీ, సివిక్స్ పరీక్షలకు కొవ్వూరు పట్టణంలో మూడు పరీక్ష కేంద్రాల్లో 756 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 286 మందికి గాను ఏడుగురు, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 265 మందికి ఎనిమిది మంది, చైతన్య కళాశాలలోని పరీక్ష కేంద్రంలో 230 మందికి గాను పది మంది గైర్హాజరయ్యారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి


నిడదవోలు రూరల్: గ్రామాల్లోని చెత్తను సేకరించి వర్మికంపోస్టు తయారీ ద్వారా సంపద సృష్టించాలని ఎంపీడీఓ టి.మూర్తిబాబు సూచించారు. మునిపల్లిలో వర్మికంపోస్టు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మూర్తిబాబు తడి, పొడి చెత్త సేకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలిచ్చారు. అనంతరం డి.ముప్పవరంలోని ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు.

న్యాయశాస్త్రంలో లక్ష్మణరావుకు పీహెచ్‌డీ



ఏయూ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకుంటున్న లక్ష్మణరావు

నిడదవోలు రూరల్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయకళాశాల బయ్యే లక్ష్మణరావుకి పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఆయన ఆచార్య డి.సూర్యప్రకాశరావు మార్గదర్శకత్వంలో ఉమెన్ అగ్రికల్చర్ లేబర్ – పాలసీ పర్స్‌పక్టివ్స్:ఏ సోషియో లీగల్ స్టడీ ఇన్‌సెలెక్టెడ్ డిస్ట్రిక్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశం మీద థీసెస్ సమర్పించారు. ఓఎన్‌జీసీలో జనరల్ మేనేజర్‌గా ఉద్యోగ విరమణ చేసిన లక్ష్మణరావు.. పశ్చిమగోదావరి జిల్లాలోని వ్యవసాయ కూలీల స్థితిగతులు, సంబంధిత చట్టాలపై పరిశోధన చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జియాలజీలో ఎమ్మెస్సీ చేసి ఉద్యోగంలో చేరారు. తర్వాత న్యాయవిద్యపై మక్కువతో రాత్రి కళాశాలలో బీఎల్, ఆ తరువాత పార్ట్‌టైమ్‌లో ఎమ్మెల్ డిగ్రీలు పూర్తి చేశారు. ఉద్యోగ విరమణ అనంతరం పీహెచ్‌డీ చేశారు. ఆయనకు డాక్టరేట్ రావడంపై ఏయూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయకళాశాల ఆచార్యులు, పరిశోధకులు, మిత్రులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయనను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 979 పదో తరగతి పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు.



బయ్యే లక్ష్మణరావుకు సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు